మంగళవారం

24-09-2024

# ముందడుగు

దినపత్రిక


సంపుటి: 1, సంచిక: 465 పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయోచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com



మనదేశం నుంచి ఆస్కార్‌కు లాపతా లేడీస్

మిగతా 2లో



కేజ్రీవాల్ కుర్చీ పక్కన ఆతిశీకి మరో కుర్చీ

మిగతా 2లో



శ్రీ సుబ్రహ్మణ్యస్వామికి విశేష అభిషేకం

మిగతా 3లో



ప్రొఫెషనలిజం పేరుతో మంచి నిర్ణయాలపై దాడి..

మిగతా 5లో

## బహుజన వ్యతిరేకి పార్టీ బిజెపి

### కులగణన పేరు చెప్పడానికి మోడీకి భయం

రిజర్వేషన్లకు తాము నష్టం జరగనివ్వం.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ



**ముందడుగు జాతీయం:**

బిజెపి బహుజన వ్యతిరేకి అని, కేంద్రం తమకు వ్యతిరేకంగా ఎన్ని ప్రచారాలు చేసినా రిజర్వేషన్లను కాపాడుకుంటామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. 'కుల గణన' పేరు చెప్పడానికే ప్రధాని భయపడుతున్నారని, బహుజనులు వారి హక్కులను పొందడం బహుశా ఇష్టం లేదేమోనని సోషల్ మీడియా వేదికగా ఆరోపించారు. "బహుజన వ్యతిరేక భాజపా ఎన్ని అబద్ధాలు వ్యాప్తి చేసినా రిజర్వేషన్లకు నష్టం జరగనివ్వం. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని తొలగించి సమగ్ర కులగణన జరిపి ప్రతీ వర్గానికి హక్కులు, వాటా, న్యాయం జరిగేవరకు ఆగబోము" అని రాహుల్ అన్నారు. కులగణన అనేది దేశంలోని రాజకీయ సమస్య మాత్రమే కాదని, వెనకబడిన వర్గాల వారికి న్యాయం చేయడమే తన జీవిత లక్ష్యమని పేర్కొన్నారు.

మిగతా 2లో



## కాంగ్రెస్ దళిత వ్యతిరేక పార్టీ

### దళిత నేతలను అవమానించారు

ఎన్నికల ప్రచార సభలో అమిత్ షా

**ముందడుగు జాతీయం:**

దళిత నేతలైన కుమారి సెల్జా, అశోక్ తన్వార్ వంటి నేతలతో పాటు ప్రతి ఒక్కరిని కాంగ్రెస్ పార్టీ అవమానించిందని, కాంగ్రెస్ దళిత వ్యతిరేక పార్టీ అని బిజెపి అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా విమర్శించారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా తోహనాలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. రిజర్వేషన్ల అంశంపై రాహుల్ గాంధీ అమెరికాలో చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించిన అమిత్ షా.. ఈ దేశంలో ఎస్సీలు, ఓబీసీల రిజర్వేషన్లను కాపాడేవారు ఎవరైనా ఉన్నారంటే.. అది ప్రధాని నరేంద్ర మోదీ

మిగతా 2లో

## కాళేశ్వరంపై మళ్లీ కొనసాగించనున్న దర్యాప్తు

### జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఆదేశాలు

**ముందడుగు తెలంగాణ:**

భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ఎత్తిపోతల్లోని బ్యారేజీలపై న్యాయ విచారణ నిర్వహిస్తున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ మళ్లీ దర్యాప్తు కొనసాగించనుంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టల నిర్మాణంలో పనిచేసిన ఇంజనీర్లను రేపట్నుంచి శనివారం వరకు విచారించనుంది. అప్పటి ఈఎన్సీలను, ఉన్నతాధికారులను ప్రశ్నించనుంది. ఈ నేపథ్యంలో అన్ని నివేదికలు ఇవ్వాలని నీటి పారుదల శాఖను కమిషన్ ఆదేశించింది.

మిగతా 2లో



## చిన్నారుల పోర్న్ వీడియోలు చూస్తే జైలుకే

పోక్సో చట్టం కింద కేసు నమోదు.. సుప్రీంకోర్టు సంచలన తీర్పు

**ముందడుగు ఢిల్లీ:**

చిన్నారులకు సంబంధించిన పోర్న్ వీడియోలను డౌన్ లోడ్ చేయడం కానీ, వీక్షించడం కానీ.. పోక్సో చట్టం కిందకు వస్తాయని సుప్రీంకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. చిన్నారులపై లైంగిక వేధింపులను అడ్డుకునే చట్టానికి సంబంధించిన విషయంలో సుప్రీం ధర్మాసనం ఈ తీర్పు చెప్పింది. చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్,



ముందడుగు
మంగళవారం, 24-09-2024, హైదరాబాద్

# బహుజన వ్యతిరేకి పార్టీ బిజెపి

(మొదటిపేజీ తరువాయి)
రాహుల్ గాంధీ ఇప్పటికే పలుమార్లు రిజర్వేషన్ల గురించి మాట్లాడిన విషయం తెలిసిందే. ఇటీవల అమెరికా (USA) పర్యటనలో ఉన్న కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ రిజర్వేషన్ల అంశంపై చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. ప్రస్తుతం భారత్‌లో ఆదివాసీలు, దళితులు, ఓబీసీలకు సరైన ప్రాధాన్యం దక్కడం లేదని రాహుల్ గాంధీ అన్నారు. అప్పటివరకు అభివృద్ధిలో వారి భాగస్వామ్యం అంతంతమాత్రంగానే ఉందన్నారు. దేశంలో అన్నివర్గాల వారికీ పారదర్శకంగా అవకాశాలు లభించే పరిస్థితులు వచ్చిన తర్వాతే రిజర్వేషన్ల రద్దు గురించి తమ పార్టీ ఆలోచిస్తుందని వ్యాఖ్యానించారు. దీంతో ఆయన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. రాహుల్‌పై విమర్శలు వచ్చాయి. దీంతో ఆయన తన వ్యాఖ్యలపై క్లారిటీ ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# కాంగ్రెస్ దళిత వ్యతిరేక పార్టీ

(మొదటిపేజీ తరువాయి)
ఒక్కరేనన్నారు. 'గత పదేళ్లుగా హరియాణాలోని ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి చేశాం. రాబోయే ఐదేళ్లకు మళ్లీ భాజపాను ఆశీర్వదించండి. కేంద్రంలో మోదీ సర్కార్ ఉంది.. ఇక్కడ భాజపా ప్రభుత్వం ఏర్పాటైతే.. ఈ డబుల్ ఇంజిన్ సర్కార్ హరియాణాను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతుంది. గతంలో కాంగ్రెస్ పాలనలో హరియాణా రైతుల భూముల విషయంలో అవినీతికి పాల్పడ్డారు'' అని అమిత్ షా ఆరోపించారు. కుమారి సెల్జా ప్రస్తుతం కాంగ్రెస్ ఎంపీగా, సీడబ్ల్యూసీ సభ్యురాలిగా కొనసాగుతున్నారు. ఆమె అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి ఆసక్తి కనబరచగా.. అందుకు అధిష్ఠానం నిరాకరించింది. అలాగే, కొన్నేళ్ల పాటు కాంగ్రెస్‌లో కీలక నేతగా ఉన్న అశోక్ తన్వార్ ఈ ఏడాది జనవరిలో భాజపాలో చేరిన విషయం తెలిసిందే.

# కాళేశ్వరంపై మళ్లీ కొనసాగించనున్న దర్యాప్తు

(మొదటిపేజీ తరువాయి)
బ్యారేజీల నిర్మాణానికి సంబంధించిన ప్లేస్‌మెంట్ రిజిస్టర్, ఎంబుక్‌లను కూడా తీసుకురావాలని కమిషన్ ఇంజినీర్లకు ఆదేశాలు జారీ చేసింది. ఈ విచారణలో కమిషన్‌ను తప్పుదోవ పట్టించినా, నేరపూరితంగా వ్యవహరించినా, వారిపై అవినీతి నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేయాలని, భవిష్యత్‌లో పదోన్నతులు ఇవ్వవద్దని ప్రభుత్వానికి సిఫారసు చేసే యోచనలో ఉన్నట్లు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ వెల్లడించింది. తుది నివేదిక ఇవ్వాలని విజిలెన్స్ విభాగానికి ఆదేశాలు జారీ అయ్యాయి. కాళేశ్వరం నివేదిక ఆధారంగా కాగ్ అధికారుల నుంచి కూడా వివరాలు తీసుకోనున్నట్లు కమిషన్ తెలిపింది.

## చిన్నారుల పోర్న్ వీడియోలు చూస్తే జైలుకే

(మొదటిపేజీ తరువాయి)
జస్టిస్ జేబీ పర్దివాలాతో కూడిన ధర్మాసనం ఈ తీర్పునిచ్చింది. చైల్డ్ పోర్న్ వీడియోలను డౌన్‌లోడ్ చేయడం కానీ, వీక్షించడం కానీ పోక్సో నేరం కాదు అని మద్రాసు హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఆ తీర్పును ఇవ్వడంలో మద్రాసు కోర్టు తీవ్రమైన తప్పు చేసినట్లు సుప్రీం ధర్మాసనం వెల్లడించింది. 28 ఏళ్ల ఓ వ్యక్తి చైల్డ్ పోర్న్ వీడియోలను తన మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసిన కేసులో మద్రాసు హైకోర్టు ఈ తీర్పును ఇచ్చింది. ఆ వ్యక్తిపై నేరాభియోగాన్ని కొట్టివేస్తూ తీర్పునిచ్చింది. దాన్ని ఇవాళ సుప్రీంకోర్టు రిస్టోర్ చేసింది. ఆ వ్యక్తిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సుప్రీం తన ఆదేశంలో పేర్కొన్నది.

# తృణమూల్ ఎమ్మెల్యేను విచారించిన సిబిఐ

## కోల్‌కతా వైద్యురాలి కేసులో జోక్యమే కారణం

ముందడుగు పశ్చిమబెంగాల్:



పశ్చిమబెంగాల్ కోల్‌కతాలోని జూనియర్ వైద్యురాలి అత్యాచార ఘటనకు సంబంధించిన కేసులో సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది. తాజాగా తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే నిర్మల్ ఘోష్ సీబీఐ విచారణకు హాజరయ్యారు. వైద్యురాలి అంత్యక్రియల సమయంలో ఆయన జోక్యం ఉండడమే అందుకు కారణంగా తెలుస్తోంది. వైద్యురాలి మృతదేహానికి హడావుడిగా అంత్యక్రియలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో నిర్మల్ ఘోష్ జోక్యం చేసుకున్నట్లు సీబీఐ ఆరోపిస్తోంది. దీంతో ఆయనకు సమన్లు జారీ చేసింది. దీంతో ఆయన విచారణకు హాజరైనట్లు సంబంధిత అధికారి తెలిపారు.

# మనదేశం నుంచి ఆస్కార్‌కు లాపతా లేడీస్

## వెల్లడించిన ఫిల్మ్ ఫెడరేషన్ ఇండియా

ముందడుగు జాతీయం:



దేశవ్యాప్తంగా మంచి పేరు సాధించిన 'లాపతా లేడీస్' అరుదైన ఘనత సాధించింది. 2025 ఆస్కార్‌కు మనదేశం నుంచి ఎంపికైంది. ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఈ విషయాన్ని అధికారికంగా తెలిపింది. స్పర్శ్ శ్రీవాత్సవ, నితాన్షి గోయెల్, ప్రతిభ తదితరులు ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం ఇటీవల విడుదలై ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. మన దేశం తరఫున ఈ సినిమా ఆస్కార్‌కు కచ్చితంగా ఎంపికవుతుందని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో కిరణ్‌రావు ధీమా వ్యక్తంచేశారు. '2025లో ఆస్కార్ అవార్డుల్లో భారత్ తరఫున అధికారిక ప్రవేశానికి 'లాపతా లేడీస్' అర్హత సాధిస్తుందని నాకు పూర్తి నమ్మకముంది. ఈ సినిమా ఆస్కార్ వేదికపై మన దేశానికి ప్రాతినిధ్యం వహించాలనేది నాతో పాటు మా యూనిట్ అందరి కోరిక' అని కిరణ్‌రావు ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. 2001 కాలపు చిత్రకథ ఇది. గ్రామీణ ప్రాంతానికి చెందిన ఇద్దరు నవ వధువులు రైలు ప్రయాణంలో అనుకోకుండా తారుమారైన సంఘటన ఇతివృత్తంగా 'లాపతా లేడీస్'ని తెరకెక్కించారు. ప్రముఖ నటుడు ఆమిర్ ఖాన్ నిర్మించారు.

# కేజ్రీవాల్ కుర్చీ పక్కన ఆతిశీకి మరో కుర్చీ

## అధినేతపై గౌరవాన్ని చాటుకున్న ఆతిశీ

ముందడుగు ఢిల్లీ:



దేశ రాజధాని ఢిల్లీ కొత్త ముఖ్యమంత్రిగా ఆతిశీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సమయంలో ఆమె ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌పై తనకున్న గౌరవాన్ని చాటుకున్నారు. ఆయన కోసం పక్కన కుర్చీని ఖాళీగా ఉంచి, తాను వేరే సీట్లో కూర్చొని బాధ్యతలు చేపట్టారు. దీనికి సంబంధించిన దృశ్యాలను ఆప్ ఎక్స్(ట్విటర్) ఖాతాలో షేర్ చేసింది. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ రామాయణంలోని ఓ సందర్భాన్ని ప్రస్తావించారు. "నాకు ప్రస్తుతం భరతుడికి ఎదురైన పరిస్థితే ఉంది. రాముడు వనవాసానికి వెళ్లినప్పుడు.. భరతుడు పాలించాల్సి వచ్చింది. సింహాసనంపై రాముడి పాదుకలు ఉంచి రాజ్యాన్ని ఏలాడు. ఈ కుర్చీ అరవింద్ కేజ్రీవాల్‌ది. నాలుగు నెలల తర్వాత జరిగే ఎన్నికల్లో ఢిల్లీలో మళ్లీ ఆయన అధికారాన్ని చేపడతారని విశ్వసిస్తున్నాను. ఆయన తిరిగివచ్చేవరకు ఈ కుర్చీ ఇక్కడే ఉంటుంది'' అని ఆతిశీ అన్నారు.

ముందడుగు
మంగళవారం, 24-09-2024, హైదరాబాద్

## ఆంధ్రప్రదేశ్‌లో అంతర్జాతీయ

# న్యాయ కళాశాల

### 100 ఎకరాల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయం

### న్యాయశాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష




**ముందడుగు ఆంధ్రప్రదేశ్:**

ఆంధ్రప్రదేశ్‌లో 100 ఎకరాల్లో అంతర్జాతీయ న్యాయ కళాశాల ఏర్పాటు చేయనున్నట్లు సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. సోమవారం ఆయన న్యాయశాఖపై సమీక్ష నిర్వహించారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటు ప్రతిపాదనలను త్వరలోనే కేంద్రానికి పంపనున్నట్లు స్పష్టం చేశారు. మంత్రివర్గ భేటీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తామన్నారు. అమరావతిలో అంతర్జాతీయ న్యాయ కళాశాల ఏర్పాటుపైనా సీఎం సమీక్ష నిర్వహించారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రస్టు ద్వారా 100 ఎకరాల్లో న్యాయకళాశాల ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.10 వేల గౌరవ వేతనం ఇవ్వాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియ ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. జూనియర్ న్యాయవాదులకు శిక్షణ అకాడమీ ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు.



# టీచర్లు ఇబ్బంది పెడుతున్నారని విద్యార్థులు పరార్

### కొండమీదికి వెళ్లిన 35మంది విద్యార్థులు.. పల్నాడు జిల్లా యడ్లపాడులో ఘటన

**ముందడుగు ఆంధ్రప్రదేశ్:**

గురుకుల పాఠశాల హాస్టల్‌లోని టీచర్లు నిత్యం ఇబ్బంది పెడుతున్నారంటూ విద్యార్థులు గోడ దూకి పరారయ్యారు. ఈ ఘటన పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం వంకాయలపాడులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వంకాయలపాడులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సోమవారం ఉదయం ప్రార్థన ముగియగానే ప్రహరీ గోడ దూకి 67 మంది విద్యార్థులు బయటకు వెళ్లారు. గమనించిన ఉపాధ్యాయులు కొందరు విద్యార్థులను అక్కడే పట్టుకున్నారు. మిగిలిన 35 మంది సమీపంలోని కొండవీటి కొండలపైకి వెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు 16వ నంబరు హైవే పక్కన ఉన్న తుమ్మపాలెం వద్ద విద్యార్థులను గుర్తించి పాఠశాలకు తీసుకెళ్లారు.

అనంతరం నరసరావుపేట డీఎస్పీ, చిలుకలూరిపేట రూరల్ సీఐ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ తమను ఉపాధ్యాయులు వేధిస్తున్నట్లు ఆరోపించారు. నాణ్యమైన ఆహారం, సరిపడా మంచి నీరు అందించడంలేదన్నారు. ఆటలు ఆడుకునేందుకు అవకాశం కల్పించడంలేదని, ఉచిత విద్యకు కూడా వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. నిజానిజాలను విచారించి విద్యార్థులకు న్యాయం చేస్తామని చెప్పారు. అప్పటివరకు విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, అనుమతి లేకుండా బయటకు వెళ్లొద్దన్నారు.

## శ్రీ సుబ్రహ్మణ్యస్వామికి


# విశేష అభిషేకం

**ముందడుగు శ్రీశైలం:**

లోక కల్యాణం కోసం షష్ఠిని పురస్కరించుకుని దేవస్థానం ఉదయం ఆలయప్రాంగణంలోని శ్రీ సుబ్రహ్మణ్యస్వామి (కుమారస్వామి) వారికి విశేష పూజలను నిర్వహించడం జరిగింది. ప్రతి మంగళవారం మరియు కృత్తికానక్షత్రం, షష్ఠి తిథి రోజులలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారికి ఈ విశేష అభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానం సేవగా (సర్కారిసేవగా) నిర్వహించబడుతున్నాయి. కుమారస్వామివారికి పూజలు జరపడం వలన లోకకల్యాణమే కాకుండా ప్రతి ఒక్కరికి ఉద్యోగ, వ్యాపార, వ్యవహారాలలో ఆటుపోట్లు తొలగి ఆయా పనులు సక్రమంగా జరుగుతాయి. సుబ్రహ్మణ్యస్వామి అనుగ్రహంతో శత్రు బాధలు, గ్రహపీడలు, దృష్టి దోషాలు మొదలైనవి తొలగి పోతాయి. అలాగే సంతానం కోసం పూజించేవారికి తప్పక సంతానభాగ్యం లభిస్తుందని చెప్పబడుతోంది. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలైన పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరి నీళ్లు మరియు వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా వివిధ పళ్ల రసాలతో చేసే అభిషేకంతో ఎంతో ఫలితం ఉంటుందని ఆగమాలు చెబుతున్నాయి.



ముందడుగు
మంగళవారం, 24-09-2024, హైదరాబాద్




# మింత్రా బిగ్ ఫ్యాషన్ ఫెస్టివల్ 26 సెప్టెంబరున ప్రారంభం

ముందడుగు హైదరాబాద్:

అందరూ ఎంతో ఆసక్తిగా వేచి చూస్తున్న బిగ్ ఫ్యాషన్ ఫెస్టివల్ తేదీలను మింత్రా ప్రకటించింది. ఈ 26 సెప్టెంబరు 2024న ప్రారంభం అవుతున్న బీఎఫ్ఎఫ్ ఎడిషన్‌కు బోట్ టైటిల్ స్పాన్సర్‌గా ఉంది. ఈ ఉత్సవం సుమారు 3.4 మిలియన్ స్టైల్స్‌ను వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువస్తోంది.

బిగ్ ఫ్యాషన్ ఫెస్టివల్ గురించి మింత్రా, రెవెన్యూ మరియు గ్రోత్ సీనియర్ డైరెక్టర్ నేహా వలీ మాట్లాడుతూ, "బిగ్ ఫ్యాషన్ ఫెస్టివల్ ఈ ఎడిషన్ కేవలం షాపింగ్ గురించి మాత్రమే కాదు; ఇది మా వినియోగదారులకు పండుగ ఫ్యాషన్ అనుభవాన్ని పునర్నిర్వచించడమే. అసమానమైన స్టైల్స్ మరియు విలువతో నడిచే ప్రతిపాదనలు, అంతర్జాతీయ, దేశీయంగా మా ఎంపికతో పాటుగా, దేశవ్యాప్తంగా విభిన్నమైన పండుగలను జరుపుకునే లక్షలాది మంది భారతీయులకు ఫ్యాషన్, బ్యూటీ మరియు జీవనశైలిని అందించడానికి మేము కట్టుబడి ఉన్నాము. స్వదేశీ బ్రాండ్‌లు షాపింగ్ అనుభవాన్ని నిజంగా వేగవంతంగా మరియు ఆనందించేలా చేస్తాయి" అని వివరించారు.

# దిక్సూచి షార్ట్ ఫిల్మ్ టీజర్ విడుదల

## అతిథులుగా ఆర్పీ పట్నాయక్, ఎస్పీ శివకుమార్






ముందడుగు హైదరాబాద్:

కలకత్తాలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్యనే ఇతివృత్తంగా తీసుకొని దిక్సూచి షార్ట్ ఫిల్మ్ నిర్మించారు. ఈ ఫిల్మ్ కు సంబంధించిన టీజర్ ను ప్రముఖ సంగీత దర్శకుడు పట్నాయక్, చంచల్ గూడ జైలు ఎస్పీ శివకుమార్, యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి విడుదల చేశారు. అత్యంత ఉత్కంఠతో ఎంతో అద్భుతంగా నిర్మించారని వారు అన్నారు. ఇలాంటి లఘు చిత్రాలు మంచి సందేశత్మక చిత్రాలు ఇంకా రావాలి వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ ఫర్ యాంటి కరప్షన్ మీడియా కార్యదర్శి జయరాం, సినిమా టీం.. డైరెక్టర్ శివ నాగరాజ్, ప్రొడ్యూసర్ రమేష్ బాబు కోమటి, యాక్టర్స్ హేమ పెదకోట, దినేష్619, కృష్ణ వంశీ, ఎడిటర్ కేతన్ కుమార్ గౌడ్, కలరిస్ట్ రామోజు మణికంఠ, క్రేజీ బాయ్స్ సాయి & టీం పాల్గొన్నారు.

# గ్రాండ్ షోప్సీ మేళా పండుగ సంబరాలను ప్రారంభం




ముందడుగు హైదరాబాద్:

భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్నమరియు అత్యంత విలువైన ప్లాట్‌ఫారమ్ ఫ్లిప్ కార్ట్ షాపింగ్ వాతావరణాన్ని గ్రాండ్ షోప్సీ మేళాగా ప్రారంభిస్తూ పండుగ సంబరాలకు సన్నద్ధమవుతోంది. సాంప్రదాయ భారతీయ వేడుకల సారాన్ని సంగ్రహించి, అసమానమైన షాపింగ్ అనుభవాన్ని అందిస్తూ షోప్సీ ప్లాట్ ఫారాన్ని శక్తివంతమైన వర్చువల్ మేళాగా మారుస్తుంది.

ఈ సంవత్సరం అతిపెద్ద అమ్మకం గురించి షోప్సీ బిజినెస్ హెడ్ ప్రత్యూష అగర్వాల్ మాట్లాడుతూ,"గ్రాండ్ షోప్సీ మేళా గతంలో కంటే పెద్దదిగా, ఇంకాస్త మెరుగ్గా వన్ స్టాప్ మేళాగా తిరిగి వస్తోంది. పండుగ సీజన్ కోసం సిద్ధం కావాల్సిన అన్ని వర్గాల భారత్ ఇషాపర్లకు విలువైన ఉత్పత్తులను అందిస్తోంది. వర్చువల్ ప్రపంచంలో మా వినియోగదారులకు ఈ ఉత్సవ షాపింగ్ అనుభవాన్ని అందించడానికి మేము సంతోషిస్తున్నాము, వైవిధ్యం, నాణ్యత మరియు సరసమైన ధరలను ప్రధాన అంశంగా ఉంచుతాం అన్నారు.

# తెలంగాణలో గణనీయమైన ప్రగతి సాధించిన సక్షం




ముందడుగు హైదరాబాద్:

కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ యొక్క వినూత్న చొరవ ప్రాజెక్ట్ డిజిటల్ సక్షమ్‌తో తెలంగాణలోని ఎంఎస్ఎంఈ రంగం డిజిటల్ టెక్నాలజీల ప్రయోజనాన్ని పొందుతోంది. ఈ ప్రాజెక్ట్ తెలంగాణలో గణనీయమైన ప్రగతిని సాధించింది, హైదరాబాద్ & పోచంపల్లిలో 10,053 ఎంఎస్ఎంఅ ఆకట్టుకునే ఔట్రీచ్‌తో తన మిషన్‌ను విజయవంతంగా పూర్తి చేసింది, 2,132 వ్యాపారాలకు శిక్షణను అందించింది మరియు 1,654 ఎంటర్‌ప్రైజెస్ దత్తత రేటును సాధించింది.

సిఐఐ నేషనల్ ఎంఎస్ఎంఈ కౌన్సిల్ కోఛైర్మన్ ఎం. పొన్నుస్వామి, ప్రోగ్రామ్ యొక్క విజయంపై మాట్లాడుతూ డిజిటల్ సక్షం చొరవ తెలంగాణ ఎంఎస్ఎంఈ రంగానికి రూపాంతరం చెందింది. అవసరమైన డిజిటల్ సాధనాలు మరియు నైపుణ్యాలతో పారిశ్రామికవేత్తలను సన్నద్ధం చేయడం ద్వారా, మేము వృద్ధి, స్థిరత్వాన్ని ప్రోత్సహిస్తున్నాము. తెలంగాణలో సూక్ష్మ సంస్థలు ఎదుర్కొంటున్న సమస్య యొక్క లోతును అర్థం చేసుకోవడానికి స్థానిక శిక్షకులను నియమించామని తెలిపారు.



# 110 మంది కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం

ముందడుగు హైదరాబాద్:

ఐదు తరాలకు చెందిన 110మంది కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం అదివారం ఆదిబట్ల వెదుకా ఫార్మ్స్ & రిసార్ట్స్ జరిగింది. ఓరుగంటి రామ నర్సయ్య జగ్గమ్మ కుటుంబ ఆత్మీయ సమ్మేళనంలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కుటుంబంలో పెద్దవారికి నూతన వస్త్రములతో సన్మానం చేశావు. కుటుంబ సభ్యులందరు కలిసి వివిధ కార్యక్రమాలతో సంతోషంగా పాల్గొన్నారు. ప్రస్తుతం ఉన్నా తరాలకి బంధాలు బంధుత్వాలు ప్రేమలు గురించి మరియు వాటి గొప్పతనాన్ని తెలియచేస్తూ ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి కుటుంబం ఒక మధుర జ్ఞాపకాన్ని పొందడం జరిగింది. 88 ఏళ్లు మొదలుకొని ఒక సంవత్సరం పూర్తిచేసుకున్నా పిల్లలు కూడా ఇందులో ఉండడం విశేషం. ఈ కార్యక్రమం కోసం వివిధ ప్రాంతాలనుండి పెద్దలు, పిల్లాపాపలతో హాజరయ్యారు.

ముందడుగు
మంగళవారం, 24-09-2024, హైదరాబాద్



# కిమ్ పాలనతో ఇద్దరు మహిళలకు ఉరిశిక్ష

## మరో తొమ్మిది మంది మహిళలకు జీవితఖైదు

**ముందడుగు ఉత్తరకొరియా:**

ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌కు నియంత అనే పేరు ఉంది.. చాలా మంది ఆయన్ని మనిషి కాదు, రాక్షసుడు అంటుంటారు. ఆ దేశంలో ప్రజలకు ఎన్నో కండీషన్లు. చివరకు తలకి ఉండే జుట్టు, పెట్టుకునే పేరు విషయంలో కూడా కిమ్ ప్రత్యేక ఆదేశాలు జారీ చేశాడు. ప్రపంచ దేశాల్లో ప్రజాస్వామ్యాలు ఫరిడవిల్లుతున్న ఈ రోజుల్లో ఇలాంటి నియంతల్ని నెత్తిన పెట్టుకొని పోషిస్తున్న నార్త్ కొరియా ప్రజలు నిజంగా దురదృష్టవంతులే. తాజాగా కిమ్ పుణ్యమా అని ఇద్దరు మహిళలకు ఉరిశిక్ష పడిపోయింది.

ఉత్తర కొరియాకి చెందిన కాంగ్, రీ అనే ఇద్దరు మహిళలు చైనాలో ఉంటున్నారు. అలా ఉన్నందుకు కిమ్ ఎలాంటి అభ్యంతరమూ చెప్పలేదు. కానీ వాళ్లు చైనాలో ఉంటూ ఉత్తరకొరియా నుంచి దక్షిణ కొరియాకు పారిపోవాలనుకునే వారికి హెల్ప్ చేస్తున్నారు. ఎలా పారిపోవాలో, ఎలా సరిహద్దు దాటాలో అన్నీ చూసుకుంటున్నారు. ఈ విషయం కిమ్‌కి తెలిసింది. దిమ్మ తిరిగింది. పెద్ద పెద్ద వాళ్లకే తనను చూస్తే.. వణుకొస్తుంది.. అలాంటిది వేరే దేశంలో ఉన్న ఆ ఇద్దరు మహిళలకూ ఇంత ధైర్యమా.. అనుకున్న కిమ్.. వాళ్లను నార్త్ కొరియాకి రప్పించాడు. వాళ్లను ఉరితీయించాడని వార్తలు వస్తున్నాయి. కొన్ని రోజుల కిందట ఈ ఉరి అమలైనట్లు తెలిసింది. కిమ్ ప్రభుత్వం ఈ ఘటనపై భిన్నంగా స్పందించింది. ఆ ఇద్దరు మహిళలూ మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని చెప్పింది. ఐతే.. ఆ ఇద్దరినే కాదు.. మరో 9 మంది మహిళలను కూడా పట్టుకొని.. వారికి జీవిత ఖైదు విధించింది. ఇలా కిమ్ చేసిన పనిని చూసి ప్రపంచ దేశాలు ఖండిస్తున్నాయి. కానీ కిమ్‌ని మాత్రం ఏమీ చెయ్యట్లేదు. మాటలకే పరిమితం అవుతున్నాయి.




## ఎమోషనల్ టచ్‌తో కార్తీ, అరవింద్ స్వామి

# సత్యం సుందరం ట్రైలర్

కోలీవుడ్ స్టార్ యాక్టర్లు కార్తీ (Karthi), అరవింద్ స్వామి (Aravindha Swamy) లీడ్ రోల్స్‌లో నటిస్తోన్న తమిళ చిత్రం మెయ్యళగన్ (Meiyazhagan). 96 ఫేం ప్రేమ్ కుమార్ సీ (Prem Kumar C) దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ తెలుగులో 'సత్యం సుందరం' (Sathyam Sundaram) పేరుతో విడుదల కానుంది. సెప్టెంబర్ 28న తెలుగు రాష్ట్రాల్లో విడుదలవుతోంది. ప్రమోషన్స్‌లో భాగంగా ట్రైలర్ లాంచ్ చేశారు.

కార్తీ, అరవింద్‌స్వామి మధ్య అనుబంధం నేపథ్యంలో భావోద్వేగపూరిత సన్నివేశాలతో సినిమా ఉండబోతున్నట్టు ట్రైలర్‌తో హింట్ ఇచ్చేశాడు డైరెక్టర్. ఇద్దరి స్నేహితుల కథతో ఫన్ ఎలిమెంట్స్‌తో సరదా సన్నివేశాలతో సీరియస్ ఎలిమెంట్స్‌తో సినిమా సాగనున్నట్టు ట్రైలర్ చెప్పకనే చెబుతోంది. ఈ చిత్రాన్ని హోం బ్యానర్ 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై సూర్య- జ్యోతిక రాజశేఖర్ కర్పూరసుందరపాడ్యన్‌తో కలిసి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ మూవీలో రాజ్ కిరణ్, శ్రీదివ్య, స్వాతి, దేవదర్శిణి, జయప్రకాశ్, శ్రీరంజిని ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి 96 ఫేం గోవింద్ వసంత సంగీతం అందిస్తున్నాడు. ఈ చిత్రం తమిళంలో సెప్టెంబర్ 27న విడుదలవుతోంది.

# రీల్స్ పిచ్చిలో వృద్ధుడి ముఖంపై ఫోమ్

## ఫోమ్ కొట్టిన యువకుడి అరెస్ట్, కేసు నమోదు

**ముందడుగు ఉత్తరప్రదేశ్:**

సోషల్ మీడియా విచ్చలవిడిగా పెరిగిపోతుంది.. చాలా మంది సోషల్ మీడియాలో ఫేమస్ అయ్యేందుకు వివిధ మార్గాలను ఎంచుకుంటున్నారు. ఎక్కువ శాతం మంది ఫేమస్ అయ్యేందుకు రీల్స్ వాడుతున్నారు. రీల్స్ చేసే క్రమంలో ప్రమాదకర స్టంట్లు చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకున్న సందర్భాలూ ఉన్నాయి. రీల్స్ సరదాతో కొందరు చేసే పనులు.. ఇతరులను కూడా ప్రమాదంలోకి నెడుతున్నాయి. అలాంటి ఘటనే ఉత్తరప్రదేశ్‌లో చోటు చేసుకొంది. సైకిల్‌పై వెళుతున్న వారి ముఖాలపై ఫోమ్ కొట్టిన ఓ యువకుడిని పోలీసులు తాజాగా అరెస్టు చేశారు. ఝాన్సీలో నిత్యం రద్దీగా ఉండే నవాబాద్ ప్రాంతంలోని రోడ్డుపై ఇద్దరు యువకులు వికృత చేష్టలకు పాల్పడ్డారు. ఆ రోడ్డులో ఓ వృద్ధుడు సైకిల్‌పై వెళుతున్నాడు. అదే సమయంలో బైక్‌పై వెళుతున్న ఇద్దరు యువకులు అతడి పట్ల అనుచితంగా ప్రవర్తించారు. ఒక వ్యక్తి డ్రైవింగ్ చేస్తూ ఉంటే.. మరో యువకుడు ఆ వృద్ధుడి ముఖంపై వైట్ ఫోమ్‌ను స్ప్రే చేశాడు. మరికొంత దూరం వెళ్లాక మరో వ్యక్తితోనూ ఇదే విధంగా ప్రవర్తించారు. పైగా దీన్ని ఫోన్లో చిత్రీకరించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో నెటిజన్లు తీవ్రంగా స్పందించారు.

